650 కిలోమీటర్ల మైలేజీ

సరికొత్త ఈవీని పరిచయం చేసిన బీవైడీ • రూ.41-53 లక్షల శ్రేణిలో ధర

న్యూఢిల్లీ, మార్చి 5: చైనాకు చెందిన ఎల్క్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి నయా మాడల్‌ను పరిచయం చేసింది. మూడు వెర్షన్లలో లభించనున్న ఈ సరికొత్త కారు ప్రీమియం ఫీచర్లు, సింగిల్ చార్జింగ్‌తో 650 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కేవలం 15 నిమిషాల చార్జింగ్‌తో 200 కిలోమీటర్లు ప్రయాణించే ఈ మాడల్‌ను తొలుత బుకింగ్ చేసుకున్న కొనుగోలుదారులకు హోమ్ చార్జర్, వ్యారెంటీ ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. 'సీల్' ఎల్క్ట్రిక్ సెడాన్ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ప్రారంభ ధర రూ.41 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..ప్రీమియం వెర్షన్ రూ.45.55 లక్షలు, సెడాన్ రకం రూ.53 లక్షలకు లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఎల్క్ట్రానిక్ హైడెన్ ఫ్లష్ డోర్, 15.6 అంగుళాల టచ్‌స్క్రీన్, ఆటోమేటిక్‌గా వర్షం సెన్సింగ్ వైప్స్, ఏసీ వెంట్స్ మార్చుకునే విధంగా డిజైన్ చేసింది. అదనపు స్థలం, భద్రత, పనితీరు ఆధారంగా రూపొందించిన మూడో మాడల్ ఇదేనని బీవైడీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాలకృష్ణన్ తెలిపారు. హైదరాబాద్‌లో బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఈవీ ప్లాంట్ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడంపై ఆయన స్పందిస్తూ..డిమాండ్ ఏదైతేనేం, మేము ప్రభుత్వ నిబంధనల ప్రకారం దానిని తీర్చడానికి ప్రయత్నిస్తున్నాం,

కారు ప్రత్యేకతలు:

- కేవలం 3.8 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 650 కిలోమీటర్లు ప్రయాణించనున్నది
- ఈ కారు కోసం ముందస్తు బుకింగ్ చేసుకోవాలంటే రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.
- ఈ నెల 31లోగా బుకింగ్ చేసుకున్న వారికి 7 కిలోవాట్ల చార్జర్‌తోపాటు ఉచితంగా ఇన్‌స్టాల్ చేసి ఇవ్వడంతోపాటు 3 కిలోవాట్ల పోర్టబుల్ చార్జర్, మొబైల్ పవర్ సప్లై యూనిట్‌ను అందిస్తున్నది.
- ఆరేండ్లపాటు రోడ్ అసిస్టెన్స్‌తోపాటు ఉచితంగా ఒకసారి సర్వీసింగ్ చేయనున్నట్లు తెలిపారు.
- ఈ కారు బ్యాటరీపై ఎనిమిదేండ్లు లేదా 1.6 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ, మోటర్/మోటర్ కంట్రోలర్‌పై ఎనిమిదేండ్లు లేదా 1.5 లక్షల కిలోమీటర్లు, డీసీ అసెంబ్లీపై ఆరేండ్లు లేదా 1.5 లక్షల కిలో మీటర్ల వ్యారెంటీ ఇస్తున్నది.

పసిడి.. జిగేల్

ఆల్‌టైమ్ హైకి ధరలు.. 65 వేలకు తులం • ఒక్కరోజే రూ.800 పెరిగిన రేటు

న్యూఢిల్లీ, మార్చి 5: బంగారం ధరలు రివ్వున దూసుకెళ్లాయి. ఈ క్రమంలోనే స్పాట్ మార్కెట్‌లో సరికొత్త రికార్డు స్థాయిని చేరాయి. మంగళవారం ఒక్క రోజే 24 క్యారెట్ తులం రేటు ఏకంగా రూ.800 ఎగబాకింది. దీంతో 10 గ్రాముల పుత్తడి విలువ దేశ రాజధాని ఢిల్లీలో ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.65,000లుగా నమోదైంది. సోమవారం ఇది రూ.64,200లుగానే ఉన్నది. అంతర్జాతీయ పరిణామాలు భారతీయ మార్కెట్‌ను ప్రభావితం చేసినట్టు తాజా ట్రేడింగ్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ జూన్‌లో వడ్డీరేట్లను తగ్గించబోతున్నదన్న ఊహాగానాలు పెరిగాయని చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత మూడు రోజుల్లో ఎంసీఎక్స్‌లో రేట్లు రూ.2,400లకు పైగా పెరిగాయంటున్నారు.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లోనూ పసిడి ధరలు పరుగులు పెట్టాయి. 24 క్యారెట్ 10 గ్రాములు రూ.760 ఎగిసి రూ.64,850గా ఉన్నది. 22 క్యారెట్ రూ.700 పెరిగి రూ.59,450కి చేరింది. నిజానికి గతకొద్ది రోజులుగా బంగారం ధరలు పెరుగుతూపోతున్నాయి. ఈ నెల 2న కూడా తులం ధర రూ.930 పుంజుకున్నది. అంతకుముందు రోజు రూ.330 పెరుగగా, వారం రోజుల్లో 24 క్యారెట్ రేటు రూ.2,020 ఎగిసింది. 22 క్యారెట్ కూడా రూ.1,860 ఎగబాకింది.

వెండి ధరలూ..

వెండి ధరలూ పుంజుకున్నాయి. ఢిల్లీలో కిలో ధర రూ.900 ఎగిసి రూ.74,900లను తాకింది. ఇక హైదరాబాద్‌లోనైతే రూ.1,200 ఎగబాకి రూ.78,200లకు చేరింది. సాధారణ వినియోగదారులతోపాటు ఇండస్ట్రీ వర్గాల నుంచి పెరిగిన డిమాండ్ కలిసొచ్చినట్టు ట్రేడర్లు చెప్తున్నారు. ఇక గ్లోబల్ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్సు గోల్డ్ 2,110 డాలర్లుగా ఉన్నది. గత ముగింపుతో చూస్తే 1 శాతం పెరిగింది. వెండి ఔన్సు 23.88 డాలర్లు పలికింది. అంతకుముందు 23.09 డాలర్లుగా ఉన్నది. 'అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్, ఈక్విటీలు స్థిరంగా సాగుతున్నా.. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతలతో ఇన్వెస్టర్లు బంగారం, వెండిపై పెట్టుబడుల దిశగా కదులుతున్నారు' అని జేఎం ఫైనాన్షియల్ ఉపాధ్యక్షుడు ప్రణవ్ మేర్ అంటున్నారు.

> దేశీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ధరలు మునుపెన్నడూ లేనివిధంగా కొత్త రికార్డు స్థాయికి చేరాయి. మంగళవారం ఢిల్లీలో 24 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ రేటు ఏకంగా రూ.65,000లు పలికింది. ఈ ఒక్కరోజే రూ.800 పెరిగింది.
>
> **-సౌమిల్ గాంధీ, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ విశ్లేషకులు**

> అమెరికాలో పారిశ్రామిక మందగమనం సంకేతాలు, నెమ్మదించిన రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు బంగారం ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి.
>
> **-జతిన్ త్రివేది, ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రిసెర్చ్ అనలిస్ట్**

డార్క్ ఎడిషన్‌గా మూడు మాడళ్లు

- మార్కెట్లోకి విడుదల చేసిన టాటా మోటర్స్

న్యూఢిల్లీ, మార్చి 5: దేశీయ ఆటో మొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్..మార్కెట్లోకి మరో మూడు సరికొత్త మాడళ్లను విడుదల చేసింది. డార్క్ ఎడిషన్‌గా నెక్సాన్ ఈవీ, నెక్సాన్, హారియర్, సఫారీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రత్యేక ఎడిషన్‌గా ప్రవేశపెట్టిన ఈ మూడు మాడళ్లు నలుపు రంగుల్లోనే తీర్చిదిద్దింది. నెక్సాన్ డార్క్ ఎడిషన్ ధరను రూ.11.45 లక్షలుగాను, నెక్సాన్ ఈవీ డార్క్ ఎడిషన్ రూ.19.49 లక్షలు, హారియర్ డార్క్ ఎడిషన్ రూ.19.99 లక్షలు, సఫారీ డార్క్ ఎడిషన్ రూ.20.69 లక్షలుగా నిర్ణయించింది. నెక్సాన్ ఈవీ డార్క్ ఎడిషన్‌ను 40.5 కిలోవాట్ల బ్యాటరీ, 143 బీహెచ్‌పీ ఎల్క్ట్రిక్ మోటర్‌తో రూపొందించిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 465 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

భెల్‌కు 9,500 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ, మార్చి 5: విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భారత్ హెవీ ఎల్క్ట్రికల్స్ లిమిటెడ్(భెల్).. ఎన్‌టీపీసీ నిర్మించతలపెట్టిన 1,600 మెగావాట్ల సింగ్రౌలీ థర్మల్ పవర్ ప్రాజెక్టు(స్టేజ్-2) ఆర్డర్ లభించినట్లు తెలిపింది. ఈ ఆర్డర్ విలువ రూ.9,500 కోట్ల స్థాయిలో ఉంటుందని తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని సోనేభద్ర జిల్లాలో సింగ్రౌలీ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశలో భాగంగా 1,600 మెగావాట్లు (2*800 మెగావాట్లు) విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నది.

'విద్యుదుత్పత్తిలో రామగుండం అగ్రగామి'

జ్యోతినగర్ (రామగుండం), మార్చి 5: థర్మల్ పవర్ స్టేషన్‌లో 4,200 మెగావాట్ల సామర్థ్యంతో రామగుండం ఎన్టీపీసీ దేశంలోనే రెండో అతిపెద్ద విద్యుదుత్పత్తి సంస్థగా నిలిచింది. ఈ విషయాన్ని రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు మంగళవారం వెల్లడించారు. నాలుగు దశాబ్దాలుగా తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ఈ ప్రాజెక్టు చరిత్రలో ఒక మైలురాయిగా నిలువడానికి ఉద్యోగులు, కార్మికుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. 40 ఏండ్ల క్రితం 200 మెగావాట్లతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం 2,600 మెగావాట్లకు విస్తరించింది. అలాగే 800 మెగావాట్ల మొదటి యూనిట్‌ను మార్చి 1, 2023న ప్రధాని నరేంద్ర మోదీ వాణిజ్య కార్యకలాపాలకు ప్రారంభించగా.. తాజాగా సోమవారం (ఈ నెల 4న) 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను వర్చువల్ ద్వారా మోదీ దేశానికి అంకితం చేశారన్నారు.

ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 195 పాయింట్లు డౌన్

ముంబై, మార్చి 5: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లు నిరాశావాదంగా ఉండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను తరలించుకుపోవడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మార్కెట్లు నష్టాల్లోకి జారుకోవడానికి ప్రధాన కారణమని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఒక దశలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 195.16 పాయింట్లు నష్టపోయి 73,677.13 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 49.30 పాయింట్లు కోల్పోయి 22,356.30 వద్ద నిలిచింది. వరుస లాభాలతో సోమవారం రికార్డు స్థాయికి చేరుకున్న ఇరు సూచీలు వెనక్కి తగ్గాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలు కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయన్నారు. గత నాలుగు సెషన్లలో సూచీ రెండు శాతానికి పైగా లాభపడిన విషయం తెలిసిందే.

- బజాజ్ ఫిన్ సర్వ్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నాలుగు శాతానికి పైగా నష్టపోయాయి.
- ఇన్ఫోసిస్, నెస్లె, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, హెచ్‌యూఎల్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఐటీసీ, కొటక్ బ్యాంక్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, ఏషియన్ పెయింట్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు నష్టపోయాయి.
- టాటా మోటర్స్, ఎయిర్‌టెల్ షేర్లు మూడుశాతానికి పైగా లాభపడి టాప్ గెయినర్లుగా నిలిచాయి.
- ఎస్బీఐ, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, పవర్‌గ్రిడ్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ప్యాసింజర్, కమర్షియల్ వాహన వ్యాపారాన్ని విడగొడుతూ తీసుకున్న నిర్ణయంతో టాటా మోటర్స్ షేరు అత్యధికంగా 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నది.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ 1.61 వాతం నష్టపోగా..ఎఫ్ఎంసీజీ 1.02 శాతం, టెక్నాలజీ, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్ షేర్లు పడిపోయాయి.
- ఎనర్జీ, టెలికమ్యూనికేషన్, యుటిలిటీ, వాహన షేర్లు లాభాల్లో ముగిశాయి.

3 లక్షల కోట్లకు మీడియా&ఎంటర్‌టైన్‌మెంట్

న్యూఢిల్లీ, మార్చి 5: దేశవ్యాప్తంగా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం అంచనాలకుమించి రాణిస్తున్నది. 2023లో 8.1 శాతం వృద్ధితో రూ.2.32 లక్షల కోట్లకు చేరుకోగా, ఈ ఏడాది రూ.2.55 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఫిక్కీ, ఈవై మంగళవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. వచ్చే ఏడాది చివరినాటికి ఈ రంగం రూ.3 లక్షల కోట్లు దాటనున్నదని అంచనావేస్తున్నది. డిజిటల్ మీడియా జోష్ కారణం. 2022లో రూ.70,900 కోట్లుగా ఉన్న టెలివిజన్ రంగం ఆ తర్వాతి ఏడాదిలో 1.83 శాతం తగ్గి రూ.69,900 కోట్లకు పడిపోయింది. అలాగే 2023లో రూ.65,400 కోట్లుగా ఉన్న డిజిటల్ మీడియా రంగం ఈ ఏడాది రూ.75,100 కోట్లకు చేరుకుంటుందని నివేదిక అంచనావేస్తున్నది. ఇదే క్రమంలో వచ్చే ఏడాది 13.5 శాతం వృద్ధితో రూ.95,500 కోట్లకు చేరుకోనున్నదని తెలిపింది.

లక్ష్యం.. ఆంత్రప్రెన్యూర్

- మహిళా ఉద్యోగుల్లో అత్యధికుల మాట ఇదే
- ఇండియాలెండ్స్ సర్వేలో వెల్లడి

ముంబై/న్యూఢిల్లీ, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం దగ్గరపడుతున్న క్రమంలో స్త్రీల ఆర్థికపరమైన అంశాలపై కొన్ని ఆసక్తికర సర్వేలు విడుదలయ్యాయి. ఇందులోభాగంగానే దేశంలోని మహిళా ఉద్యోగుల్లో అత్యధికులు ఆంత్రప్రెన్యూర్స్‌గా ఎదగాలని భావిస్తున్నట్టు ఓ తాజా సర్వేలో తేలింది. సొంతంగా వ్యాపారం చేయాలన్న ఆలోచనతో ఉన్నట్టు ఆన్‌లైన్ మార్కెటీర్ ఇండియాలెండ్స్ చేపట్టిన ఈ సర్వేలో స్పష్టమైంది. దేశవ్యాప్తంగా ఉన్న మెట్రో నగరాలతోపాటు ప్రథమ, ద్వితీయ శ్రేణి పట్టణాల్లోగల 24-55 ఏండ్లకు చెందిన 10వేలకుపైగా మహిళా ఉద్యోగుల అభిప్రాయాలతో ఈ సర్వే జరిగింది. వీరిలో ఏకంగా 76 శాతం మంది తమకు సొంతంగా ఏదైనా వ్యాపారాన్ని ప్రారంభించాలనే కోరిక ఉన్నట్టు చెప్పడం విశేషం. ఇక 86 శాతం మంది బడ్జెటింగ్, ఇన్వెస్టింగ్, సేవింగ్, ఇతర ఆర్థిక సాధనాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలనే ఆసక్తిని వ్యక్తపర్చినట్టు వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులపై డాటాను అందించే ఆన్‌లైన్ వేదిక ఇండియాలెండ్స్ చెప్పింది.

రుణాలు పెరిగాయ్

గత ఏడాది మహిళలు తీసుకున్న రుణాల్లో 19 శాతం వృద్ధి కనిపించింది. 2023లో రూ.30.95 లక్షల కోట్ల రుణాలు తీసుకున్నారు. 2022లో రూ.26 లక్షల కోట్లేనని మంగళవారం విడుదల చేసిన ఓ నివేదికలో క్రెడిట్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ కంపెనీ క్రిఫ్ హై మార్క్ తెలిపింది. ఇక అంతకుముందుతో పోల్చితే నిరుడు వ్యక్తిగత రుణాలు 26 శాతం పెరిగి రూ.12.76 లక్షల కోట్లుగా ఉన్నాయి.

బోర్డుల్లో ప్రాధాన్యత

తాము ఎక్కువ రేటింగ్ ఇచ్చిన సంస్థల బోర్డుల్లో మహిళా డైరెక్టర్లు పెద్ద సంఖ్యలోనే ఉన్నారని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తెలిపింది. 3,138 కంపెనీలకు బీఏఏ, ఆపై రేటింగ్‌నే ఇచ్చామని, వీటి బోర్డుల్లో సగటున 29 శాతం మహిళలే ఉన్నారని చెప్పింది. ఇదిలా వుంటే ఫార్చూన్ ఇండియా 500 కంపెనీల్లో కేవలం 1.6 శాతం కంపెనీలకే మహిళలు నాయకత్వం వహిస్తున్నట్టు ఓ అధ్యయనంలో వెల్లడైంది. అయితే ఫార్చూన్ ఇండియా నెక్స్ట్ 500 కంపెనీల్లో మహిళల సారథ్యంలో పనిచేస్తున్నవి 5 శాతంగా ఉన్నాయి.

పాలనాపరమైన సమస్యల్లేవ్

- ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ స్పష్టీకరణ
- ఆర్బీఐ దెబ్బకు షేర్లు కుదేలు

న్యూఢిల్లీ, మార్చి 5: పాలనాపరమైన సమస్యల్లేవని ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం బంగారం రుణాలను ఇవ్వరాదంటూ ఈ సంస్థకు ఆంక్షలు విధించిన నేపథ్యంలో మంగళవారం సదరు కంపెనీ స్పందించింది. 'సంస్థలో పాలనాపరమైన సమస్యల్లేవని నిస్సందేహంగా చెప్తున్నాం. ఇవన్నీ కార్యకలాపాలకు సంబంధించిన సమస్యలే. మిక్కిలి ప్రాధాన్యతతో వీటిని పరిష్కరిస్తాం. వెంటనే ఈ సమస్యను తీర్చడానికి గట్టి చర్యలు తీసుకుంటాం. బంగారం రుణాలు మినహా సంస్థ నుంచి అందుతున్న ఇతర సేవలు కొనసాగుతాయి.' అని అనలిస్టులతో జరిగిన ఓ కాన్ఫరెన్స్ కాల్‌లో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ తెలియజేసింది. 'ఆర్బీఐ తీసుకునే చర్యలు కాస్త కఠినంగానే ఉండొచ్చు. కానీ మా గోల్డ్ లోన్ కస్టమర్లకు సంబంధించి ఆర్బీఐ నుంచి మేము అందుకున్న ఫిర్యాదులు 135 మాత్రమే. నిజానికి మా వ్యాపార పరిమాణంతో పోల్చితే ఇవి చాలాచాలా తక్కువ' అని కూడా ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం చెప్పింది. ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియోలో పలు పర్యవేక్షణా లోపాలను ఆర్బీఐ గుర్తించింది. దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆంక్షల నిర్ణయం తీసుకున్నది. తక్షణమే గోల్డ్ లోన్లను ఆపేయాలని ఆదేశించింది.

20 శాతం క్షీణించిన షేర్లు

సంస్థపై ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ షేర్లు కుప్పకూలాయి. మంగళవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో ఐఐఎఫ్ఎల్ షేర్ విలువ ఏకంగా 20 శాతం పతనమై రూ.478.5 వద్ద ముగిసింది. ఈ ఒక్కరోజే రూ.119.60 దిగజారింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లోనూ 19.99 శాతం క్షీణించి రూ.477.75 వద్ద నిలిచింది. సోమవారం ముగింపుతో చూస్తే రూ.119.40 తగ్గినట్టైంది. ఆర్బీఐ ఆంక్షలతో మదుపరులు భయాందోళనకు గురయ్యారని, అందుకే అమ్మకాల ఒత్తిడిలోకి వెళ్లారని ట్రేడింగ్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

సాత్విక్, చిరాగ్ జోడీ బోణీ

- ఫ్రెంచ్ బ్యాడ్మింటన్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్ పోరులో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-13, 24-22 తేడాతో ఒంగ్ యా సిన్, తియో ఈ యి(మలేషియా) ద్వయంపై అద్భుత విజయం సాధించింది. 47 నిమిషాల్లో ముగిసిన పోరులో సాత్విక్, చిరాగ్ తమదైన రీతిలో సత్తాచాటారు. ప్రస్తుత బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ జోడీగా కొనసాగుతున్న సాత్విక్, చిరాగ్..మలేషియా జంటపై గత ఎనిమిది మ్యాచ్‌ల్లో ఇది ఐదోసారి గెలువడం. తదుపరి రౌండ్‌లో భారత ద్వయం..మరో మలేషియా జోడీని ఎదుర్కొనుంది. కామన్వెల్త్‌గేమ్స్ కాంస్య విజేత గాయత్రీ గోపీచంద్, త్రిసా జాలీ జోడీ 16-21, 21-19, 21-17తో భారత్‌కే చెందిన అశ్విని పొనప్ప, తనీషా క్రాస్టో జంటపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. ఇటీవల జరిగిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ చారిత్రక విజయంలో గాయత్రి, త్రిసా జాలీ కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్‌కు ఆరో ఓటమి

- ప్రైమ్ వాలీబాల్ లీగ్

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్)లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ వరుస ఓటముల పరంపర దిగ్విజయం కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 6-15, 11-15, 12-5తో బెంగళూరు టార్పడోస్ చేతిలో ఓటమిపాలైంది. గ్రూపు దశలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో హైదరాబాద్‌కు ఇది ఆరో ఓటమి కావడం విశేషం. హైదరాబాద్‌పై విజయంతో బెంగళూరు సూపర్-5 ఆశలను సజీవంగా నిలుపుకుంది. మరోవైపు ఆరు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన బ్లాక్‌హాక్స్ నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. బెంగళూరు ప్లేయర్ సేతు మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించాడు. బ్లాక్‌హాక్స్ ఆటగాడు సాహిల్‌కుమార్ సూపర్ స్పైక్‌లతో ఎదురుదాడికి ప్రయత్నించగా, శ్రాజన్ శెట్టి(బెంగళూరు) నెట్ దగ్గర కండ్లు చెదిరే బ్లాక్‌లతో ఆకట్టుకున్నాడు.

నాగల్ శుభారంభం

ఇండియన్ వెల్స్ (అమెరికా): ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీలో భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ అదిరిపోయే శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ పోరులో నాగల్ 6-2, 6-2తో అమెరికా వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ప్లేయర్ స్టెఫాన్ డొస్టానిక్‌పై అలవోక విజయం సాధించాడు. ఎనిమిదో సీడ్‌గా బరిలోకి దిగిన నాగల్ 68 నిమిషాల్లో ప్రత్యర్థిని చిత్తు చేసి టోర్నీలో ముందంజ వేశాడు. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ఈ భారత నంబర్‌వన్ ప్లేయర్ సింగిల్ బ్రేక్‌పాయింట్‌ను ఎదుర్కొకుండా మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు.

లక్ష్య చాహర్ నాకౌట్

బూస్టో అర్‌సిజియో(ఇటలీ): వరల్డ్ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్ టోర్నీలో భారత బాక్సర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతున్నది. జాతీయ చాంపియన్ లక్ష్య చాహర్ తన తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. మంగళవారం జరిగిన పురుషుల 80కిలోల విభాగం మొదటి పోరులో లక్ష్య చాహర్..గెశ్లాగీ మేసమ్(ఇరాన్) చేతిలో నాకౌట్ అయ్యాడు. తొలి రౌండ్‌ను 2-3తో చేజార్చుకున్న లక్ష్య..మలిరౌండ్‌లో పుంజుకుని పోటీలోకి వచ్చాడు. ఓవైపు పదునైన పంచ్‌లు, హుక్స్, జాబ్స్‌తో ముప్పేట దాడికి పాల్పడి రెండో రౌండ్‌లో 3-2 ఆధిక్యం ప్రదర్శించాడు.

ఢిల్లీ జోరు

మెరిసిన రోడ్రిగ్స్, ల్యానింగ్.. ముంబైపై ఘన విజయం

ఆట

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎదురన్నదే లేకుండా పోయింది. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో దూసుకెళుతున్న ఢిల్లీ వరుస విజయాలను ఖాతాలో వేసుకుంటున్నది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను చిత్తుచేస్తూ ఢిల్లీ తమ అగ్రస్థానాన్ని మరింత పటిలం చేసుకుంది. సొంతగడ్డపై తమకు తిరుగులేదన్న రీతిలో ముంబైకి ముచ్చెమటలు పట్టిస్తూ ఢిల్లీ జిగేల్‌మంది. జెమీమా రోడ్రిగ్స్, మెగ్ ల్యానింగ్ ధనాధన్ అర్ధసెంచరీలతో భారీ స్కోరు అందుకున్న ఢిల్లీ..ముంబైని స్వల్ప స్కోరుకే కట్టడి చేసింది. సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ వరుసగా నాలుగో విజయాన్ని దక్కించుకున్న ఢిల్లీ.. టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది.

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్‌లో నిరుటి రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొడుతున్నది. అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 29 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ.. జెమీమా రోడ్రిగ్స్(33 బంతుల్లో 69 నాటౌట్, 8ఫోర్లు, 3సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ మెగ్ ల్యానింగ్(38 బంతుల్లో 53, 6ఫోర్లు, 2సిక్స్‌లు)రాణించడంతో 20 ఓవర్లలో 192-4 స్కోరు చేసింది. ఇస్మాయిల్, ఇషాక్, వస్త్రాకర్, మాథ్యూస్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ముంబై 163-8 స్కోరుకు పరిమితమైంది. అమన్‌జ్యోత్‌కౌర్(42) తప్పా మిగిలిన వారంతా ఘోరంగా విఫలమయ్యారు. యస్తికా భాటియా (6), స్కీవర్ బ్రంట్(5), కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ (6), అమెలియా కెర్ (17) స్వల్ప స్కోర్లకు వెనుదిరిగారు. జొనాసెన్ (3-21), కాప్ (2-37) రాణించగా, శిఖాపాండే, టిటాస్ సాధు, రాధా యాదవ్ ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. అజేయ అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన రోడ్రిగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**రోడ్రిగ్స్, ల్యానింగ్ ధన